ఆగస్టు 6నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

దశ, హైదరాబాద్ : వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆగస్టు 6, 7, 8 తేదీల్లో 26వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానకార్యదర్శి ఎం. ప్రిస్ట్ లీ గైస్ తెలిపారు. ఈ సందర్భంగా బాలబాలికలకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో బాస్కెట్బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డి, మార్చ్ ఫాస్ట్, తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఆగస్టు 4వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు నారాయణగూడలోని వైఎంసీఏలో లేదా సెల్: 7799665544, 7032660614లో సంప్రదించాలని ఆయన కోరారు.

బోనాల పండుగ ఏర్పాట్లపై పోలీసుల సమావేశం

దశ, హయత్‌నగర్: బోనాల పండుగను పురస్కరించుకొని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చింత శంకరయ్య పెద్దమ్మ తల్లి ఆలయం, ఇన్ఫర్మేషన్ కాలనీ టెంపుల్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు, భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన చర్యలపై ఆలయ కమిటీ సభ్యులకు వివరించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

E20 పెట్రోల్‌పై అసత్య ప్రచారాలను నమ్మొద్దు

❖ *దేశ ఆర్థిక స్వావలంబన, రైతుల ఆదాయ పెంపే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం: డా. బూర నర్సయ్య గౌడ్*

దశ, హైదరాబాద్: E20 పెట్రోల్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ అన్నారు. దేశ ఆర్థిక ప్రయోజనాలు, రైతుల సంక్షేమం, విదేశీ చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎథనాల్ బ్లెండింగ్ విధానం లక్ష్యమని తెలిపారు. E20 విధానం ద్వారా పెట్రోల్‌లో 20 శాతం ఎథనాల్ వినియోగించడం వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని, చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు డిమాండ్ పెరిగి రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ విధానం దేశానికి ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. E20 పెట్రోల్ వల్ల వాహనాల ఇంజిన్లు దెబ్బతింటాయనే ప్రచారం అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. 2023 తర్వాత తయారైన వాహనాలు E20 వినియోగానికి అనుకూలంగా రూపొందించబడ్డాయని తెలిపారు. పాత వాహనాల్లో స్వల్పంగా మైలేజ్ తగ్గుదల ఉండే అవకాశం ఉన్నప్పటికీ, అది వాహన నమూనాపై ఆధారపడి ఉంటుందని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ఇంధన భద్రత, రైతుల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన లక్ష్యాలతో ఈ విధానాన్ని అమలు చేస్తోందని అన్నారు. E20 విధానంపై కాంగ్రెస్, రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రేరేపితమైనవని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకుని ఈ విధానాన్ని అర్థం చేసుకోవాలని డా. బూర నర్సయ్య గౌడ్ కోరారు.

ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం.. మైలార్‌దేవ్‌పల్లిలో అవగాహన కార్యక్రమం

దశ, రంగారెడ్డి: ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెపటైటిస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ హెపటైటిస్ కాలేయాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి అని, సకాలంలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందితే నియంత్రించవచ్చని తెలిపారు. హెపటైటిస్-బి టీకా తీసుకోవడం, పరిశుభ్రమైన ఆహారం, సురక్షిత తాగునీరు వినియోగించడం, సురక్షిత రక్త మార్పిడి, జాగ్రత్తగా ఇంజెక్షన్లు వినియోగించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని సూచించారు. లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ జ్యోతిబాయి, డాక్టర్ సమీనా, వైద్య అధికారి డాక్టర్ రేఖ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. హెపటైటిస్ లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స, టీకాల ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించి సమాచార కరపత్రాలను పంపిణీ చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో బిఎల్ఓ బిఎల్ఏ సమావేశం

❖ *ఓటర్ల జాబితా డిజిటలైజేషన్‌పై సమీక్ష*

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీ బైరు సుదర్శన్ రెడ్డి సమక్షంలో బిఎల్ఓ బిఎల్ఏ సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకమైన, పక్కా ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా నిర్వహించిన ఈ సమావేశంలో SIR ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌పై చర్చించారు. డిజిటలైజేషన్‌కు గడువు తేదీ 03082026 కావడంతో పెండింగ్‌లో ఉన్న ఓటర్ల వివరాలను గ్రామాల వారీగా BLAలు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు. BLAలు తమ పరిధిలోని BLOలతో సమన్వయం చేసుకుని పెండింగ్‌లో ఉన్న ఓటర్ల వివరాలను సేకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో BLOలు, BLAలు, BLO సూపర్వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 28072026 సాయంత్రం 4 గంటల వరకు మొత్తం 33,410 ఓట్లకు గాను 25,384 ఓట్ల (76 శాతం) డిజిటలైజేషన్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

చౌటుప్పల్‌లో ఘనంగా రైతు నేస్తం 100వ ఎపిసోడ్

దశ, చౌటుప్పల్: రైతులకు శాస్త్రీయ వ్యవసాయ సమాచారం అందించేందుకు వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న "రైతు నేస్తం" కార్యక్రమం 100వ ఎపిసోడ్‌ను చౌటుప్పల్ మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో రైతు నేస్తం కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. చౌటుప్పల్ మండలంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ పీడీ శ్రీ దేవ్‌సింగ్, మండల వ్యవసాయ అధికారి ఎం. నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు ఉపయోగపడే సమాచారాన్ని నిరంతరం అందిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం విజయవంతంగా 100 ఎపిసోడ్‌లు పూర్తి చేసుకోవడంపై అధికారులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజం దిశగా BRR ఫౌండేషన్ మరో ముందడుగు

దశ, మంచాల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా BRR ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో మంచాల పోలీస్ స్టేషన్ సిబ్బందికి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాలను వివరించారు.

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా పర్యావరణ హితమైన జూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలంతా తమ వంతు బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు.

"ప్లాస్టిక్‌కు గుడ్‌బై.. జూట్ బ్యాగ్‌కు వెల్‌కమ్" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంచాల సీఐ మధు, అశ్వల బాలరాజు, రావుల శంకర్, దాచిరెడ్డి అమర్నాథ్, గూడె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా BRR ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను పలువురు అభినందించారు.

హుజురాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రారంభమైన తెలుగు కార్యాశాల

దశ, హుజురాబాద్: శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అకాడమిక్ ఎంపవర్ మెంట్ ప్రోగ్రాం 100 రోజుల కార్యాచరనలో భాగంగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూరాబాదు మరియు శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సృజనాత్మక రచన & స్క్రిప్ట్ రచనా నైపుణ్యాలు"అంశంపై రెండు రోజుల కార్యశాల మంగళవారం ఘనంగా ప్రారంభమైంది.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. ఇందిరా దేవి మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, ఉపాధి దిశగా వారిని తీర్చిదిద్దేందుకు ఈ కార్యశాల దోహదపడుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయం చేపట్టిన అకాడమిక్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమాలు విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి కార్యశాల లక్ష్యాలు, రెండు రోజుల కార్యక్రమాల వివరాలను వివరించారు.

ఈ కార్యశాలలో పద్యం, కవిత, కథ, నవల, నాటకం, సినీ గేయం, షార్ట్ ఫిల్మ్ స్క్రిప్ట్ రచన, వికీపీడియా రచన, జానపద గేయాల డాక్యుమెంటేషన్, పరిశోధన పద్ధతులు తదితర అంశాలపై ప్రముఖ ఆచార్యులు, రచయితలు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

ఈ అంశాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, భాషా సామర్థ్యాల పెంపునకు ఇటువంటి కార్యశాలలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రచనా నైపుణ్యాలు ప్రతి విద్యార్థికి వ్యక్తిత్వ వికాసంతో పాటు ఉద్యోగ జీవితంలోనూ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యశాల కార్యక్రమంలో.బూర్ల వెంకటేశ్వర్లు, పెద్దోట జయ సూర్య, డా.కె.లక్ష్మీనారాయణ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డా. కె.లింగారెడ్డి, ఐ.క్యు.ఎ.సి.కోఆర్డినేటర్ డా బి. రేణుక, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, రచయితలు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి: BC JAC

దశ, సూర్యాపేట ప్రతినిధి : రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి పదవి ఖాళీగా ఉండటంతో విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందని, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని BC JAC జిల్లా కన్వీనర్ బద్రబోయిన సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యాశాఖలో మంత్రి లేకపోవడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకుల విద్యాసంస్థల సమస్యలు, ఉపాధ్యాయ నియామకాలు తదితర అంశాలు పెండింగ్‌లో పడిపోయాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఏకరూప దుస్తులు అందలేదని, వెంటనే వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లను వారం రోజుల్లోగా పరిష్కరించకపోతే BC JAC ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో BC JAC జిల్లా ఉపాధ్యక్షులు బైరోజు మదనాచారి, నాయకులు ముత్యం నాగేంద్రబాబు, కృష్ణ, కూరాకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం తోనే పర్యావరణం: మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని

దశ, హుజురాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వన మహోత్సవం కార్యక్రమము మంగళవారం రోజున పురపాలక సంఘ చైర్ పర్సన్ రొంటాల సుహాసినీ అధ్యక్షతన పురపాలక సంఘ పాలకవర్గ సభ్యులకు మొక్కలను పంపిణీ చేశారు, తదుపరి చైర్ పర్సన్ మాట్లాడుతూ, ప్రజలందరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని. పెరుగుతున్న కాలుష్య నివారణకు భవిష్యత్తు తరాల మనుగడకు చెట్లు నాటడం ఎంతో అవసరమని అన్నారు, కార్యక్రమములో వైస్ చైర్ పర్సన్ గూడూరి అంజలి, కౌన్సిలర్లు మరియు కొఆప్షన్ సభ్యులు, కార్యాలయ మేనేజర్ శ్రీ ఆర్. భూపాల్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్, శ్రీకాంతో, వాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

తెలంగాణలో త్వరలో ఫ్యామిలీ రిజిస్టర్ విధానం

❖ ఒకే రికార్డుతో ప్రభుత్వ సేవలు

దశ, వరంగల్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఫ్యామిలీ రిజిస్టర్ విధానాన్ని అమలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. రేషన్ కార్డు డేటాను ఆధారంగా తీసుకుని ప్రతి కుటుంబానికి ఒకే అధికారిక కుటుంబ రికార్డును రూపొందించనుంది. మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి, రెండు పని దినాల్లోనే సర్టిఫికెట్ జారీ చేసేలా చర్యలు చేపడుతోంది.

రేషన్ కార్డు ఆధారంగా కుటుంబ రిజిస్టర్

రాష్ట్రంలోని ప్రతి కుటుంబ సభ్యుల వివరాలను రేషన్ కార్డు ఆధారంగా ఒకే రిజిస్టర్‌లో నమోదు చేయనున్నారు. కుటుంబ పెద్ద పేరుతో పాటు కుటుంబ సభ్యుల పేర్లు, వారి సంబంధం, వయస్సు, పుట్టిన తేదీ, పూర్తి నివాస చిరునామా వంటి వివరాలు ఇందులో నమోదు కానున్నాయి.

రెండు రోజుల్లో సర్టిఫికెట్ జారీ

ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం ప్రజలు మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. దరఖాస్తు చేసిన రెండు పని దినాల్లో స్థానిక తహసీల్దార్ డిజిటల్ సంతకంతో సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకురానుంది.

ప్రభుత్వ సేవలు మరింత సులభం

ఈ విధానం అమల్లోకి వస్తే ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం ప్రతిసారీ కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. ఒకే అధికారిక కుటుంబ రికార్డుతో అనేక ప్రభుత్వ సేవలను పొందే అవకాశం కలగనుంది. దీంతో ప్రజల సమయం, శ్రమ ఆదా కావడంతో పాటు సేవల్లో పారదర్శకత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఆస్తి హక్కులకు సంబంధం లేదు

ఫ్యామిలీ రిజిస్టర్ కేవలం కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం మాత్రమే ఉపయోగపడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రిజిస్టర్ ద్వారా ఎలాంటి ఆస్తి యాజమాన్య హక్కు లేదా చట్టబద్ధమైన వారసత్వ హక్కు కల్పించబడదని తెలిపింది. అలాగే ఇది సంక్షేమ పథకాలకు అర్హతను నిర్ధారించే పత్రం కాదని అధికారులు వెల్లడించారు.

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు

ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడం, ఒకే కుటుంబ రికార్డు ఆధారంగా సేవలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ విధానాన్ని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణి

దశ ఓయూ: లాలాపేట చంద్రబాబునగర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల్లో క్రీడా ఉత్సాహాన్ని నింపేందుకు మంగళవారం స్పోర్ట్స్ దుస్తులను పంపిణి చేశారు. ఇదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు వరలక్ష్మి. శ్రీలక్ష్మీల ఆర్థిక సహకారంతో పాఠశాలలోని 90 మంది విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మండల ఉప విద్యాధికారి రామలింగారెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు క్రీడా దస్తులను అందజేసిన ఉపాధ్యాయురాళ్లను ప్రత్యేకంగా కొనియాడారు. స్కూల్ హెచ్ఎం ఇందిర మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ఉపాధ్యాయులు చూపిన ప్రేమాభిమానాలు అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సహం ఎంతో అవసరం అన్నారు. భవిష్యత్తో ఇదే స్ఫూర్తిని మరి కొందరు కొనసాగించాలన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో సూర్యాపేట వారికి పలువురికి చోటు

దశ, సూర్యాపేట ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో సూర్యాపేటకు చెందిన ఇంకొంత మందికి పదవులు వరించాయి. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రచార విభాగం ఉపాధ్యక్షులుగా తప్సీ గాంధీ, రాష్ట్ర రాజకీయ విభాగ ఉపాధ్యక్షుడిగా వెంపటి సురేష్, పబ్లిక్ రిలేషన్స్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా, ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్ లకు చోటు దక్కింది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ సంఘ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేసి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వాలు పెంచడంలో సూర్యాపేట జిల్లా ముందు వరుసలో ఉండాలన్నారు. ముఖ్యంగా బీద వైశ్య వర్గాలకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు రాజా పాల్గొని వారు మాట్లాడుతూ నూతనంగా పదవులు పొందిన సభ్యులు సూర్యాపేట జిల్లాలో సేవా కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గంలో నూతనంగా పదవులు పొందిన తప్సి గాంధీ, వెంపటి సురేష్, గుండా రమేష్ లు జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు రాజా లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జలసిరితో భూగర్భ జలాల సంరక్షణ

❖ మహిళల జీవనోపాధికి ప్రోత్సాహం

దశ, చిన్నంబావి : (జూలై 28): భూగర్భ జలాల సంరక్షణతో పాటు గ్రామీణ మహిళల జీవనోపాధి మెరుగుదలకు 'జలసిరి' కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీడీఓ సుర్జ ఆదర్శ్ గౌడ్ అన్నారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జలసిరి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీవో, ఏపీఓ ధనుంజయ రాజు, ఏపీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీసీలు, టీఏలు, పీఎస్‌లు, గ్రామ సంఘాల నాయకులు, విఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తమ భూముల్లో ఫార్మ్ పాండ్స్ (నీటి గుంతలు) ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు చేపల పెంపకం, పాడి పశువుల పెంపకం, కూరగాయలు, తోటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. మహిళా సంఘాల ద్వారా ఈ కార్యకలాపాలకు రుణ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంఘ సభ్యురాలు తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

నీట్ పేపర్ లీక్ ఆందోళన.. విద్యార్థులకు సుప్రీంకోర్టు ఊరట

దశ, న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులకు సుప్రీంకోర్టు కీలక ఊరట కల్పించింది. నేర చరిత్ర లేని 18 ఏళ్ల విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని, వారిపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని కేంద్రంతో పాటు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

నేర చరిత్ర లేని విద్యార్థులకు రక్షణ

నేర చరిత్ర లేని విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నేర చరిత్ర ఉన్న వారికి ఈ రక్షణ వర్తించదని పేర్కొంది. నమోదైన ఎఫ్ఐఆర్‌లపై విచారణ కొనసాగించేందుకు అనుమతిస్తూ, విచారణ పూర్తయ్యే వరకు అర్హులైన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

సీసీటీవీ, డిజిటల్ ఆధారాలు భద్రపరచాలని ఆదేశం

నిరసనలు జరిగిన ప్రాంతాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ రికార్డింగ్‌లు, బాడీ కెమెరా వీడియోలు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ రికార్డులు, పీసీఆర్ లాగ్‌లు తదితర డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఘటనలకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

హింసపై సమగ్ర విచారణ అవసరం

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, ప్రారంభంలో నిరసనలు ప్రశాంతంగా సాగినా తర్వాత హింస చెలరేగిందని, దీనికి పోలీసులు అతిగా వ్యవహరించడమో లేదా హింసను ప్రేరేపించే వ్యక్తులు ఉద్యమంలో చొరబడడమో కారణమై ఉండవచ్చని వ్యాఖ్యానించారు. ఘటనపై నిష్పాక్షికంగా పూర్తి స్థాయి విచారణ జరగాలని, బాధ్యులను గుర్తించాలని స్పష్టం చేశారు.

ఎస్ఐటీ ఏర్పాటుపై కేంద్రం అభిప్రాయం కోరిన కోర్టు

నిరసనల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై స్వతంత్ర కమిటీ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) ఏర్పాటు చేయాలా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాల అభిప్రాయాలు, నివేదికలను సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. అలాగే పోలీసులు అతిగా వ్యవహరించారన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ ఎందుకు జరపకూడదని కూడా ప్రశ్నించింది. చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన వారిపై మాత్రం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



దశ, హుజురాబాద్: హుజురాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచాయని అన్నారు. ఈ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన సహాయం అందిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాల అమలులో జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను సకాలంలో అందజేయడంతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, వీణవంక జమ్మికుంట రైతుల ప్రయోజనాల కోసం పెండింగ్‌లో ఉన్న కాల్వల ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలని, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసి హుజురాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. రైతులు, మహిళలు, పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావాలని, ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోటాల్‌పల్లికి సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు కోరుతూ వినతి

దశ, కోటాల్‌పల్లి ప్రతినిధి: కోటాల్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ ప్రతినిధులు జిల్లా అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో మౌలిక వసతుల కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి త్వరితగతిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఇప్పలగడ్డలో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన

దశ, ఇప్పలగడ్డ ప్రతినిధి: ఇప్పలగడ్డ గ్రామపంచాయతీలో సర్పంచ్ ధరావత్ రాజమణి రాజు నాయక్ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ (SWM Rules2026), తెలంగాణ జలసిరి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. తడి, పొడి, శానిటరీ, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, బోర్ రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రమాదేవి, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, శ్రీనివాస్, వార్డు సభ్యులు ఇట్టబోయిన శ్రీనివాస్, భానోత్ మంజుల బలరాం, అంగన్‌వాడీ టీచర్ సైలజ, ఏఎన్ఎం ప్రేమలత, గ్రామ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జడ్పీ హెచ్ఎస్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ

దశ, భూపాలపల్లి : జిల్లాలో జరిగిన ఓ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల, గొర్లవీడును సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాల్య దశలో అలవర్చుకునే విద్య, సత్ప్రవర్తన, క్రమశిక్షణ, గురువులు, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవభావం వంటి విలువలే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు బలమైన పునాదులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవించే విద్యార్థులే జీవితంలో మంచి స్థానాలను సాధిస్తారని సూచించారు. రాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించే ప్రతి విద్యార్థికి రూ.10 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తానని ఆయన ప్రకటించారు. అలాగే జడ్పీ హెచ్ఎస్ గొర్లవీడు పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాష్ట్ర ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పీఆర్సీ సాధన, సీపీఎస్ రద్దు లక్ష్యంగా త్వరలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఉద్యమంలో పాల్గొని, హక్కుల సాధన కోసం పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లా బాధ్యులు మండల తిరుపతి రెడ్డి, పలిత శ్రీహరి, ఈదునూరి రవీందర్ రెడ్డి, నక్కిరెడ్డి మహేందర్, గఫార్, మండల బాధ్యులు రఘునాథ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పావలా శ్యామల భౌతికకాయం అభిమానుల సందర్శనార్థం

దశ, హైదరాబాద్: ప్రముఖ సీనియర్ నటి పావలా శ్యామల భౌతికకాయాన్ని హైదరాబాద్‌లోని వనస్థలిపురంలోని రెడీ టూ సర్వ్ ఫౌండేషన్‌లో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆమెకు తుది నివాళులు అర్పించేందుకు సినీ ప్రముఖులు, అభిమానులు, కుటుంబ సభ్యులు తరలివస్తున్నారు.

పావలా శ్యామల మరణం పట్ల సినీ అసోసియేషన్ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, వయోభారం కారణంగా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. ఆమె కుమార్తె కూడా ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కొన్నేళ్ల క్రితమే వారి సంరక్షణ బాధ్యతలను శంకర్‌కు అప్పగించినట్లు సినీ ఆర్టిస్ట్ కరాటే కళ్యాణి వెల్లడించారు.

అప్పటి నుంచి శంకర్ నిరంతరం వారికి వైద్య సహాయం అందిస్తూ, అవసరమైన చోట్లకు తీసుకెళ్తూ అండగా నిలిచారని తెలిపారు. ఈ క్రమంలో సినీ అసోసియేషన్ కూడా మానవతా దృక్పథంతో సహాయ సహకారాలు అందిస్తూ వచ్చిందని పేర్కొన్నారు.

పావలా శ్యామలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించాలని సినీ అసోసియేషన్ నిర్ణయించినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని అసోసియేషన్ సభ్యుల గ్రూపులో కూడా తెలియజేసి, సినీ ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు తుది నివాళులు అర్పించాలని విజ్ఞప్తి చేసింది.